రిక్షావాలా

ఆ దినం పెద్దపండగ. కలిమి గలిగిన మహారాజుల యిళ్ళన్నీ కలకలలాడుతున్నవి. పచ్చతోరణాలు, వింత ముగ్గులు, కొత్తగుడ్డలు, పిండివంటలు, మృష్టాన్న భోజనాలు- ఓ! సృష్టి యావత్తూ శోభాయమానంగా వెలిగిపోతోంది.

ఏయింట బట్టినా పండగ శోభ అనేక రూపాలతో అవతరించి నృత్యం చేస్తోంది. ఇంట్లోని ఆడా మొగా, పిన్నా పెద్దా కోడికూత వేళ లగాయతు క్షణం తీరికలేక అదొక నూతనచైతన్యంతో తిరుగాడుతున్నారు. ఆ రోజు చేసుకోవలసిన పిండివంటలు, వంటకాల విషయంలో గత రాత్రినుండీ బయల్దేరిన తర్కాలూ, చర్చలూ అనుకొన్నంత సూక్ష్మంగా తీర్మానాలు కావడం లేదు. ఒకరికి లడ్డూ లిష్టమైతే, మరొకరికి మైసూరుపాకు మీద మనస్సు మళ్ళుతోంది. ఒకరికి పెరుగువడ లిష్టమైతే, మరొకరికి మెదువడలు రుచి, ఒకరు పులిహోర ప్రతిపాదిస్తే, మరొకరు దధ్యోజనం ఉపపాదిస్తున్నారు. పెద్ద అల్లుడికి బొబ్బట్ల మీద భ్రాంతి అయితే చిన్న అల్లుడికి అతిరసాల మీద ఆశ. ఇంత పండగ జరుగుతూంటే ఒక్క పప్పు ఉడక తప్పదుగదా? కనీసం రెండుకూరలు, ఒక వేపుడు, మూడుపచ్చళ్ళు, ధప్పళం, కట్టుచారు, పిండివడియాలు, అప్పడాలు, పెరుగు- ఇంతమాత్రమైనా ఉండకపోతే ఎట్లా? ఇక క్షీరాన్నం లేనిది పండగ గడియలు గడిచి బయటపడటం ఎట్లా?

తెల్లవారేసరికి విరగబడిపోతున్నారు జనం- సంచీలు పట్టుకొని మార్కెట్టుమీదికి, తెల్లవారకుండానే పొరుగూళ్ళ నుండి పాలు, పెరుగు తెచ్చే అమ్మలక్కల కాళ్ళ కడ్డంతగిలి దారిలోనే, బేరమయినా చేయకుండా, ఎగనెత్తుకొనిపోతున్నారు దధిక్షీరాలు, ఆరోజు సర్కారు ఆఫీసులకు, కచ్చేరీలకు, కోర్టులకు శలవు. కాలేజీలకు, పాఠశాలలకు శలవు.

ప్రపంచం యావత్తూ ఇంతటి శోభతో వెలిగిపోతూంటే, ఆ రిక్షావాలా చేసుకొన్న పాపకర్మ మేమిటి? ఏమిటి వాడి అవతారం? ఇక వాడు తలకు నీళ్ళుపోసుకొని కొత్తగుడ్డ ధరించేది ఎన్నడు? కప్పరకప్పర చీకటిలో వాడు రిక్షాలాగలేక లాగలేక ఈడ్చుకొంటూ

దిక్కులుచూస్తూ వచ్చి బంగాళా- కాంపౌండు గోడమీదనుండి బయటికి వంగిన పచ్చగన్నేరు చెట్టుక్రింద వీధిలో వొరిగిపోతున్నాడు. కొత్త గుడ్డలు ధరించి, బయటతిరిగే ప్రతీసంపన్న గృహస్థుకీ లేచి నిలబడి దండాలు పెట్టుతున్నాడు. కాని, ఆనాడు వాడెవడి ముఖం చూచి బయలుదేరాడో, ఒక్కరూ చెప్పరు రిక్షాకావాలని.

సూర్యోదయం అయి ఎండెక్కుతోంది. చద్దినీళ్ళు తాగే గడియలు, కాని యింటికాడ వాడి భార్య గత రెండు రోజులుగా పనిచెడి లేవడం లేదు.

కడచిన రోజుకూడా వాడికి పాపిష్టిరోజే. ఆరోజు పొద్దస్తమానూ వాడు రిక్షాలాగి సాయంకాలానికి సంపాదించుకొన్న ఒక్క రూపాయి డబ్బులలోనూ, తన రిక్షాకు లాంతరుదీపం లేకుండా లాగుతున్నందుకు ఛార్జీ చేస్తానని బెదిరించిన పోలీసు జవానుకు త్రాగుడు క్రింద పన్నెండు అనాలు లంచంబెట్టి, మిగిలిన నాలుగణాలూ రిక్షా ఖామందుకు బాడుగ క్రింద జమకట్టి, దణ్ణం పెట్టుకొన్నాడు. ఇక ఆరాత్రి వాడికి గుడిసెలో మడతకుడుములతో కుక్షి నిండి, తెల్లవార్లూ, తనూ తనభార్యా కడుపులో కాళ్ళు ముడుచుకొని కాలం గడిపేరు.

కాని, తెల్లవారినా వాడికి మంచిగడియలు వచ్చినట్లు లేదు. చద్దినీళ్ళు తాగేవేళకు కడుపులో మంట లేచి నీరసించి, ఆకలి తీర్చుకోను ఇన్ని ఉప్పుశనగలు కొనుక్కోను వానిచేత దమ్మిడీ కనిపించని దుర్దినమయి పోయింది, ఆ మాయదారి పండగదినం. కాయకష్టంచేసి జీవనం గడపుకొనే అతగాడికి 'దేహి' అని చెయ్యిచాపి కానీడబ్బు ముష్టి అడుగుకోనునోరు రావడం లేదు. బొడ్డున ఉన్న పొగాకుకాడ ఒకటి తుంచి,నోట పెట్టుకొని దాని రసంతో తన నీరసం పోగొట్టుకోవడానికి ఉవ్విళ్ళూరుతున్నాడు రిక్షావాలా!

ఎండబడి పదిగంటల పొద్దెక్కింది. పదకొండు అయింది. పన్నెండుకూడా అయింది. వొట్టుపెట్టినట్టు ఆరోజు రిక్షావాలాకు బాడుగ దొరికితే వొట్టు! ఎండ ముదిరి చిటచిటలాడుతోంది. మండే శరీరాన్ని గన్నేరు చెట్టునీడకు జేరేసి సేదతీర్చుకొంటున్నాడు. వచ్చేపోయే సంపన్నులను 'రిక్షా సామీ' అని అడిగి అడిగి వాడికి ప్రాణం విసిగిపోయింది. ప్రాణం శోషిల్లి రిక్షాలోనే వొరిగి కళ్ళు మూసుకొన్నాడు రిక్షావాలా.

ఎంతకాల మావిధంగా పడి ఉండినాడో, కాంపౌండు గోడమీదుగా విసరిన పుల్లాకుల విస్తళ్ళ దొంతర దభీమని తన రిక్షా సమీపాన్నే కింద సైడు కాలవలో పడేవరకు వానికి మెలకువ వచ్చి కళ్ళు తెరచి చూచేసరికి- ఎక్కడ కనిపెట్టుకొని ఉండినవో నూరు కాకులు వచ్చినట్లు వచ్చి ఆ పుల్లాకుల్ని ముక్కుతో, కాళ్ళతో ఈడ్చి చింపి లాగేస్తున్నవి. కాకులను తరుముతూ నాలుగు పందులు ఆకుల్లో మూతులు పెట్టి గతకడం మొదలుపెట్టినవి.

రెండు కుక్కలు వాయువేగంతో వచ్చి పందులపై బడి పుల్లాకు లన్నింటినీ బీభత్సం చేసి పారేసినవి.

ఆ పుల్లాకుల్లో నుండి కొట్టిన కమ్మని వంటకాల వాసనకు రిక్షావాలా నోరు ఊటలూరి, కడుపులో ప్రేగులు గుర్రుమని కొట్టుకోసాగినవి. అది వాని కొక అననుభూతమైన అనుభవం. ఏనాడూ ఎరగని వాని అభిజాత్యం అడ్డుతగిలి సైడుకాలవల్లో పడిన పుల్లాకుల మీద రోతనే పుట్టించింది. అందులోనూ పందులు మూతిబెట్టిన వస్తువు తాను తాకడం ఎట్లా?

మటమటమంటూ సూర్యరశ్మి వేడెక్కినకొద్దీ వాని శరీరం భుగభుగమని మండిపోతోంది. శోషవల్ల రెండు చెవులలోనూ హోరుమని శబ్దం బయలుదేరింది. ఆనాడు కూడా సాయంత్రం వరకూ వాడికిచిన్న డబ్బు సంపాదన లేకపోయినట్టయితే యిక బ్రతకడం ఎట్లా? అతని కేమీ పాలుపోలేదు. తోడి రిక్షావాణ్ణి ఒక్క పావులా డబ్బులు అప్పు అడిగాడు. 'పండగ పూట, బదులేమి'టని ఈసడించి ఊరుకున్నాడతగాడు.

ఇంతలో కాంపౌండు గేటు తెరచుకొని ఒక పెద్దమనిషి బయటకు వచ్చి 'రిక్షా' అని పలకరించాడు.

ముఖమంతా కండ్లు చేసుకొని, కొండంత ఆశతో 'సామీ' అని రిక్షావాలా లేచి నిలబడి దణ్ణం పెట్టాడు.

"టౌన్‌లోకి ఏమి తీసుకొంటావు?"

"నీ దయవచ్చినంత ఇవ్వు సామీ!"

"తర్వాత తగువులాడితే నేను ఒప్పుకోను, మూడణాలకంటే ఎక్కువనే నెన్నడూ ఇవ్వలేదు."

"నీచిత్తం" అని అంటూ, మూసిన గూడు ముందుకు విప్పి, తన వాహనం రోడ్డుమీదికి లాగి, దిండుమీది ధూళి దులిపి- "రా, సామీ" అన్నాడు రిక్షావాలా.

చేతిలోని తమలపాకులకు సున్నం రాచి పంటిసందున కొరికి, "గోవింద, గోవింద" అంటూ రిక్షా అధిరోహించాడు ఆ పెద్దమనిషి.

ఆయనొక స్థూలకాయుడు; నడిమి వయస్సువాడు. ముఖాన ఉన్న గంధం, అక్షతలూ అతను బ్రాహ్మనుడనే తెలియజేస్తున్నవి. కాని కట్టిన దోవతివల్లా, వేసుకొన్న కోటువల్లా అతడొక ప్లీడరో, సర్కారు ఉద్యోగో అని కూడా అనుకోవలసి ఉంటోంది. అతని బరువుకు రిక్షా రవంత జవజవలాడిపోయింది గాని కింది కమానులు మాత్రం విరగలేదు.

రిక్షాకు దణ్ణపెట్టి కళ్ళ కద్దుకొని, 'పరమాత్ముడా' అంటూ కాడి పైకెత్తుకొన్నాడు రిక్షావాలా. ఆ ఊపునకు బ్రాహ్మడి కడుపులోని నీళ్ళు కొబ్బరి బొండంలోలా గళగళ కొట్టుకున్నవి.

పాడురోడ్లు! మునిసిపల్ పరిపాలనంతటి అధ్వాన్నపు ప్రభుత్వం మరొకటి ఉండబోదు. అడుగడుక్కీ రోడ్డు చెడిపోయి గుంతలుపడి ఎగుడూ దిగుడూను! ఎన్నెన్ని వేలు వసూలయినా ఈ మాయదారి మునిసిపల్ బడ్జెట్టులో బొక్కపడడమూ, చివరికి రోడ్డు మరమ్మత్తుకి డబ్బు కొరతబడిపోవడమూను! ఆ పాపిష్ఠి రోడ్డుమీద పోతుంటే- పాపం, భుక్తాయాసమయినా తీరకుండా బయలుదేరాడేమో- ఆ బ్రాహ్మడికి ప్రాణాంతకంగా ఉన్నది ఆ కుదుపు. రోడ్డుకి తగినట్టుగానే ఉన్నది రిక్షాకూడా. అదొక పాతబొచ్చె, కమానులన్నీ కదిలిపోయి లొటలొటలాడుతూ రవంత వల్ల దప్పితే విరుచుకొని కింద పడిపోయేటట్టు ఉన్నది ఆయనఘటం. కింద దిండుని నల్లులే ఉన్నాయో ఏమో, పుటుకు పుటుకుమంటూ మనిషికి స్తిమితం లేకుండాపోతోంది. మట్టమధ్యాహ్నపు టెండేమో, బ్రాహ్మడికి ముఖమీదా, మెడకిందా చిరుచెమటపోసి శరీరం పేలినట్టు చిటచిటలాడిపోతోంది. "ఎందు కెక్కితినా ఈ రిక్షా" అని ఆయన దిగులుపడుతూనే ఉన్నాడుగాని, "రిక్షా నిలుపు" అని మాత్రం ఆయన నోటివెంట రావడం లేదు.

రిక్షావాడి బాధ ఆ పరమాత్ముడికే తెలియాలి. లోపలి మనిషి భారం తనకి మించిన భారంలా బరువెక్కిపోయింది. ఆ పాడురోడ్డుమీద ఆ రిక్షా లాగాలంటే అతగాడికి తల ప్రాణం తోకకి వస్తోంది. అందులో రెండు పూటలుగా అన్న రసం లోపలికి పోనట్టువంటి గడియలేమో, వాటికి అడుగడుక్కీ ఒకగండమైపోయింది. ఎంతెంత దమ్ముపట్టి హుంకరించినా గుండె దడా, ఆయాసమూ, నోరెండిపోవడమూ మాత్రమే కాని రవంత కూడా రిక్షా కదులుతున్నట్లు అతగాడికి కనిపించడం లేదు. "రిక్ష లాగలేను సామీ" అని వదలుకొంటే ఆరోజు కా మూడణాలు కూడా దక్కకుండా పోతాదేమోనని అతగాడి దిగులు. ఆ మూడణాలూ మూడువందల రూపాయలుగా అతని హృదయంలో వెలిగిపోతున్నవి. అది ఆరణాలు తీసుకోవలసిన ప్రయాణమైనా తాను నోరు విప్పి బేరంచేస్తే అసలుకు మోసం రాగలదేమో అనే భయంచేత బ్రాహ్మడు మూడణాలంటే తానున్నూ 'మాబా'గన్నాడు.

ప్రయాణం కుదుపునకు బ్రాహ్మడి నిండుకడుపు బరువెక్కి డొక్కలో సన్నని నొప్పికూడా బయలుదేరుతోంది. పండగ భోజనంలో ఏయే పదార్థాలూ, పిండివంటలూ పడ్డాయో ఆయనకుక్షిలో- ఆ ఎండలో, ఆ రిక్షామీద, ఆ రోడ్డుమీద- బ్రాహ్మడికి ఆయాసం, వగర్పు కూడా పుట్టుకొనివచ్చినవి. భోజనానంతరం సేవించిన తాంబూలం వల్ల భుక్తాయాసం రవంత సర్దుకోవలసిందే నిజానికి; కాని ఆ దిక్కుమాలిన ప్రయాణంలో తాంబూల సేవనంకూడా ఆయనకు వెగటుపుట్టి, వికారంవల్ల 'థూ' అని ఉమ్మివేసి ఊరుకున్నాడు. ఆ బాధపడలేక రిక్షా దిగి యింటికి పోవాలనుకొన్నాడు బ్రాహ్మడు. కాని సగం దూరం వచ్చిన తర్వాత దిగిపోతే పూర్తిగా మూడణాలూ తీసుకోకుండా విడిచిపెట్టుతాడా రిక్షావాడు?

ఆరణాలు ఇచ్చుకోవలసిన ప్రయాణం తనకి మూడణాలకే దొరికింది. ఎట్లా పోగొట్టుకోవడం? పోగొట్టుకొని దిగితే, తిరిగి యింటికి పోవడం ఎట్లా? తాను నడిచివెళ్లే స్థితిలో లేదే! మరణ వేదనలో ఇస్సురని నిట్టూర్చి, "గోవింద, గోవింద" అని భగవన్నామం స్మరించాడు బ్రాహ్మడు.

"నారాయణమూర్తీ!" అని ఉస్సురంటున్నాడు రిక్షావాలా. 'కరువులో అధికమాసం' అన్నట్టు అక్కడ ఎత్తయిన బ్రిడ్జి ఒకటి దాపురమైంది. రిక్షావాడు హుం అని హుంకరించి బ్రిడ్జిమీదికి లాగుతూంటే శరీరం యావత్తూ ముచ్చెమటలుపోసి, గొంతులో వేడినిట్టూర్పువల్ల తడి ఎండిపోయి, ఒక్కొక్క తడవ తను ముందుకు లాగే రిక్షా అంత బరువుతోనూ తటాలున వెనక్కి కూడా జరిగిపోతోంది. రిక్షా చెయ్యిజారితే ఏం ప్రమాదం సంభవిస్తుందోనని బ్రాహ్మడు భగవంతుడి మీద భారంవేసి, "భద్రం, భద్రం" అని పైనుండి కిందివాడికి హెచ్చరిక చేస్తున్నాడు.

బ్రిడ్జి ఎక్కేసరికి తిరపతికొండ ఎక్కినంత పనిఅయి రిక్షావాడు తలకిందులై పోతున్నాడు. కాని, బ్రాహ్మడు మాత్రం బ్రదుకు జీవుడా అని ఒక్క నిట్టూర్పు విడిచాడు.

కాని, కష్టసుఖాలు కావడి కుండలు. బ్రిడ్జి ఎక్కి దిగుడులో కిందికి తిరిగేవరకు కొండమీది నుండి దొర్లించిన పుచ్చకాయలా జర్రున జారిపోతోంది రిక్షా. ఈసారి రిక్షా బలవంతాన లాగవలసిన ప్రమేయం వాడికి లేకపోయినప్పటికీ ఆ దూకుడులో రిక్షాతో సమానంగా పరుగుపెట్టవలసి వచ్చింది రిక్షావాడికి. రిక్షాదూకుడుకు ఆ గులక రాతిరోడ్డు మీద బ్రాహ్మడి శరీరం హూనంఅయిపోయినట్టయి, కడుపులో వెర్రిబాధ బయల్దేరి, రిక్షా పూర్తిగా కిందికి దిగే పర్యంతమయినా ఆబాధకి తట్టుకోలేక-

"ఇస్సు, అబ్బా! నిలపరా నీయమ్మ కడుపుకాలా!" అని బ్రాహ్మడు వెర్రికేకపెట్టాడు.

ఆ కేకతో బేజారెత్తి బలవంతాన రిక్షా రోడ్డుపక్కకి లాగి నెమ్మదిగా కిందికి దింపేడు రిక్షావాలా.

ఆ బ్రాహ్మడికి అదేమి బాధో పాపం, రిక్షాలోనుండి కిందికి దిగడానికయినా సందులేకుండా రిక్షాలో కూర్చునే బయట రోడ్డుమీదికి ఓక్కు ఓక్కుమని డోక్కుంటుంటే, కడుపులోని హోళిగ ముక్కలు, ఆవడలు, క్షీరాన్నం, కూరముక్కలు, సాపుసీదా కడిగివేసినట్ట బొళబొళమంటూ బయటపడిపోయి ఆ బ్రాహ్మడికి ప్రాణం కడంటిపోయింది.

ఆ ప్రయాణపు దెబ్బకి మలమలమాడే రిక్షావాలాకి కడుపులో చెయ్యిపెట్టి కలచినట్టయి వికారంపుట్టి, వొళ్ళు తిరిగి పక్కనే రోడ్డుమీద కూర్చుని కక్కుకుంటూంటే-

దోవన బోయే ఒక మోటారు అక్కడ నిలిచి- "అయ్యో, పెద్దమనిషి కెంత ఆపద వచ్చిం"దంటూ బ్రాహ్మణ్ణి ఎక్కించుకొని యింటి దగ్గర దిగబెట్టింది.